నవభూమి
కరీంనగర్
అనుబంధం
24 సెప్టెంబర్,2024 మంగళవారం పేజీలు:3
www.epaper.navabhoomi.in




## తేలనున్న అసైన్డ్

# భూముల లెక్క



**తంగళ్లపల్లి:-నవభూమి:** ఎల్ఆర్ఎస్ కోసం మూడు శాఖల సర్వే తంగళ్లపల్లి మండలంలో వెలసిన వెంచర్ ప్లాట్ల క్రమబద్ధీకరణలో ప్రభుత్వ అసైన్డ్ భూములను గుర్తించే ప్రక్రియలో ముందడుగు పడుతుంది.ప్రభుత్వ భూమిలో ఎక్కడ ప్లాట్లు ఉన్నాయనే విషయం బయటపడనుంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల్లో ఎల్ఆర్ఎస్ ఆమోదం కోసం క్షేత్రస్థాయిలో పురపాలక సంఘం, రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు భాగస్వామ్యం కల్పించింది. దీంతో ఆయా శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో వేగం పెరిగింది.జిల్లాలో అసైన్డ్ భూములు బాగానే ఉన్నాయి. పురపాలక సంఘంలో ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువ శాతం అసైన్డ్ భూములకు సంబంధించినవే కావడంతో ఆమోదంలో కాస్త ఆలస్యం అవుతోంది. అది ప్రభుత్వ భూమా? కాదా? అనేది తేల్చేందుకు సమయం పట్టడమే ఇందుకు కారణం.గతంలో పురపాలక సంఘంలోని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ప్లాట్లను పరిశీలించేవారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానం వల్ల పట్టణ ప్రణాళిక విభాగం సూపర్వైజర్, నీటిపారుదలశాఖ ఏఈ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) ముగ్గురు కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు వివరాలను పరిశీలిస్తున్నారు.ప్రభుత్వ అసైన్డ్ భూమా? ప్రైవేటు భూమా? ఇతర వివాదాలున్నాయా అనేది రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుర్తిస్తున్నారు.బఫర్ జోన్ నిబంధనల మేరకు చెరువు, కుంటలు, వాగులు, నాలాల పక్క నుంచి ఎంత దూరంలో ఉంది, అనుమతి ఇవ్వొచ్చా అనేది నీటిపారుదలశాఖ ఏఈ పర్యవేక్షిస్తున్నారు.ఆ స్థలం రెసిడెన్షియల్, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాల్లో ఏ జోన్లోకి వస్తుందనేది చూసి, జత చేసిన పత్రాలు సరైనవో కావో అనేది పట్టణ ప్రణాళిక విభాగం సూపర్వైజర్ చూస్తున్నారు. తద్వారా అసైన్డ్ భూమి గుర్తించడంలో తేలిక అవుతుంది. వీరి ముగ్గురు ఆమోదించాకే ఎల్1 లాగిన్ నుంచి పట్టణ ప్రణాళిక విభాగం అధికారి (ఎల్2 లాగిన్)కు దరఖాస్తు పంపిస్తున్నారు. అక్కడి నుంచి ఎల్3 లాగిన్ పర్యవేక్షించే పురపాలక సంఘం కమిషనర్కు వెళ్తుంది.రుసుం చెల్లించిన తరవాత కమిషనర్ ఆమోదంతో ఎల్ఆర్ఎస్ పత్రం జారీ చేస్తారని పట్టణ ప్రణాళిక అధికారి సాయికృష్ణ తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 2025 మార్చి 31 వరకు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## పట్టా కాదు..

# పట్టు బిగించాలి



## ముంచుకొచ్చిన జలం..

# అందని పరిహారం



**వేములవాడ -నవభూమి:** ఇళ్ల పరిహారం కోసం నిర్వాసితులకు ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు.జలాశయాన్ని పూర్తి స్థాయిలో నింపినప్పుడు వెనుక జలాలు ఇళ్ల చుట్టూ చేరడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గ్రామంలోని అందరూ ఆర్అండ్ఆర్ కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటే వీరు మాత్రం నేటికీ పరిహారం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో వేములవాడ మండలం సంకెపల్లి ముంపునకు గురైంది. గ్రామంలో 358 ఇళ్లు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించిన అధికారులు 640 మంది నిర్వాసితులుగా మారుతున్నట్లు గెజిట్ ప్రచురించారు. నిర్వాసితులకు వృత్తి ఆధారంగా కుటుంబ పరిహారం చెల్లించడంతోపాటు 242 చదరపు గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చారు. ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేసి సీసీ రహదారులు, మురుగు కాలువలు, ప్రభుత్వ భవనాలను నిర్మించారు. అయితే ఇళ్ల పరిహారం చెల్లింపులు మాత్రం విడతల వారీగా చేశారు. ఇప్పటి వరకు ఇంకా 45 మంది ఇళ్లకు పరిహారం అందాల్సి ఉంది.జలాశయంలో 2017 నుంచి పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నారు. దీంతో జలాశయం బ్యాక్వాటర్ వల్ల నిర్వాసితులు ఆర్అండ్ఆర్ కాలనీకి తరలి వచ్చి తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారు.పరిహారం అందని వారు కాలనీలో ఇళ్లు నిర్మించుకోవడానికి డబ్బులు లేక అద్దెకు నివాసం ఉంటున్నారు. మరికొంత మంది గ్రామంలోని ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు.జలాశయంలో 27 టీఎంసీలు నిల్వ చేసిన సమయంలో ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో నిర్వాసితులు అక్కడి నుంచి ఖాళీ చేసి సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్తున్నారు. నీరు తగ్గిన అనంతరం తిరిగి ముంపు గ్రామంలోని ఇళ్లకు చేరుకుంటున్నారు.అద్దె ఇంట్లో నివాసం ఇంటి పరిహారం అందకపోవడంతో గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఆర్అండ్ఆర్ కాలనీలో ఇంటి స్థలం పట్టా ఇచ్చారు. ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు లేవు. అధికారులు, నాయకులు ఆదుకుంటామని ఏళ్లుగా చెబుతున్నా న్యాయం చేయడం లేదు. అద్దె చెల్లింపు ఆర్థిక భారంగా మారుతుంది.భాగ్యమ్మ, నిర్వాసితురాలు, సంకెపల్లి ధరలు పెరుగుతున్నాయి ఇంటి పరిహారం చెల్లింపులో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఇంటి నిర్మాణం చేపట్టలేదు. బహిరంగ మార్కెట్లో స్టీలు, సిమెంట్, కూలీల ధరలు పెరిగాయి. అందరి నిర్వాసితులతోపాటు మాకు పరిహారం చెల్లిస్తే ఇబ్బందులుండేవి కావు. జలాశయంలో ప్రతి సంవత్సరం నీరు పూర్తి స్థాయిలో నింపుతుండటంతో ఇళ్ల చుట్టూ చేరుతుంది. అధికారులు త్వరితగతిన పరిహారం చెల్లించి ఆదుకోవాలి.శ్రీనివాస్, బాధితుడు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాం. ఆర్అండ్ఆర్, ఇళ్ల పరిహారం చెల్లింపులతోపాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తాం. అర్హులందరికీ న్యాయం చేస్తాం. ఇళ్ల పరిహారం అందని నిర్వాసితులకు త్వరితగతిన చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

## రుణమాఫీ వర్తించేనా?



**కరీంనగర్ –నవభూమి:** జిల్లాలో రూ.2 లక్షల్లోపు రుణమాఫీకి దూరమైన అన్నదాతలు ఇప్పటికీ ఆందోళనలోనే ఉన్నారు.తమకూ వర్తిస్తుందా? లేదా అని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియ మొదలుపెట్టారు. పది రోజుల వరకు అర్హులను గుర్తించే క్రమంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులకు అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. వారు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో రుణమాఫీ పోర్టల్‌లో మరో మూడు ఐచ్ఛికాలు తీసుకొచ్చారు. ఇప్పుడు సజావుగానే జరుగుతోంది. జిల్లాలో 15,182 మంది రుణదాతల కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు 12,279 మంది సభ్యుల నిర్ధారణ పూర్తయినట్లు జిల్లా వ్యవసాయాధికారి జె.భాగ్యలక్ష్మి తెలిపారు.ఎదురైన సమస్యలు.. పరిష్కార మార్గాలు రుణమాఫీ పోర్టల్‌లో కుటుంబ సభ్యులందరి ఆధార్ సంఖ్యలు నమోదు చేయాలి. ఈ విషయంలో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. చనిపోయిన వారివి నమోదు చేయడం ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం జీవించి ఉన్న వారి ఆధార్ సంఖ్యలు నమోదు చేస్తే సరిపోతుందని ప్రభుత్వం సూచించింది.పెళ్లి చేసుకోని వారు, ఒంటరిగా ఉండేవారి కోసం రుణమాఫీ పోర్టల్‌లో ప్రత్యేకంగా ఐచ్ఛికం ఇవ్వలేదు. వీరిని ప్రత్యేక కుటుంబాలుగా పరిగణిస్తూ ఆధార్ నమోదు చేసే అవకాశం కల్పించారు.ఇతర రాష్ట్రాల్లో ఉంటూ.. అక్కడ ఆధార్ కార్డు కలిగిన రైతులకు మరో చోట భూములు ఉండడంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. వీరి ఆధార్ నమోదు సాధ్యంకాలేదు. వారు కూడా చేసుకునేలా మార్పు తెచ్చారు.సందిగ్ధంలో మరికొన్ని..రుణం తీసుకున్న వ్యక్తి మరణిస్తే.. ఆ వ్యక్తి కుటుంబ సభ్యులకు రుణమాఫీ వర్తిస్తుందా లేదా? అనే విషయంలో స్పష్టత లేదు.రుణం పొందిన ఎన్ఆర్ఐలు స్వయంగా వచ్చి వివరాలు వెల్లడించాలి. వ్యవసాయాధికారులతో సెల్ఫీ దిగాలి. వారు అక్కడి నుంచి ఇక్కడికి రావడం, సెల్ఫీ దిగడం కష్టతరంగా మారి పాలుపోని స్థితిలో ఉన్నారు.కొంతమంది రుణదాతల పేర్లు, ఆధార్ నంబర్లు తప్పుగా నమోదై మాఫీ కాని వారున్నారు. వీరికి పరిష్కారం చూపలేదు.ఈ బ్యాంకుల్లో వారికి వర్తించలేదు..బ్యాంకు ఆఫ్ బరోడా, ఇండియన్, కెనరా, ఇండియన్ ఒవర్‌సీస్, మహారాష్ట్ర బ్యాంకుల్లో రుణాలు పొందిన వేలాది మందికి రుణమాఫీ కాలేదు. వారి ఆధార్‌కార్డు నంబర్ వ్యవసాయాధికారులు నమోదు చేస్తే 'నో డాటా ఫౌండ్' అని వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులంటున్నారు. ఈ విషయంలో బ్యాంకు అధికారుల నుంచే స్పష్టత రావాల్సి ఉంది.

## విద్యుత్తు నియంత్రికను తరలించండి

**రామన్నపేట: –నవభూమి:** మల్యాల మండలం రామన్నపేట గ్రామంలోని హనుమాన్ గుడి సమీపంలో రక్షణలేని విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉందని అధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు వివరించారు.ఈ విషయమై విద్యుత్తు ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా గ్రామస్థులు స్థలం చూపిస్తే నిర్మాణ పనుల అంచనా రివైజ్ చేసి మంజూరు పొంది విద్యుత్తు నియంత్రికను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



# పట్టా కాదు.. పట్టు బిగించాలి

**పెద్దపల్లి: –నవభూమి:** ఉద్యోగ మేళాలో పేర్లు నమోదు చేసుకుంటున్న నిరుద్యోగులు చేతిలో పట్టా ఉన్నా ఉద్యోగం దొరకదు..చదివిన చదువుకు, చేసే పనికి సంబంధం ఉండదు.. ఫలితంగా మొక్కుబడిగా విధులు నిర్వర్తించడం తప్ప యువత కెరీర్‌లో రాణించలేకపోతున్నారు.. సర్టిఫికెట్ల కోసం తప్ప అవసరాలు తీర్చలేని కోర్సుల్లో బోధన విధానం మార్చడమే ప్రత్యామ్నాయమని నిపుణులు సూచిస్తున్నారు..యువతకు ఉద్యోగాన్వేషణలో అవసరమైన నైపుణ్యంపై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం జిల్లాల వారీగా టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి) కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, సిరిసిల్ల పట్టణాల్లో గతంలోనే కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పెద్దపల్లిలో ఇటీవల ప్రారంభించినా తరగతులు నిర్వహించడం లేదు. నాలుగు జిల్లాల్లో కలిపి 50 వరకు ప్రైవేటు శిక్షణ కేంద్రాలున్నా చాలా మంది అభ్యర్థులు ఆర్థిక స్థోమత లేక చేరడం లేదు. గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నా బోధన సౌకర్యం లేక ఉద్యోగ పరీక్షల్లో వెనుకబడుతున్నారు.ఉద్యోగాల వారధిగా..కొలువుల సాధనలో యువతకు ఒకప్పుడు ఉపాధి కల్పన శాఖ అండగా ఉండేది. తమ వద్ద వివరాలు నమోదు చేసుకుంటే విద్యార్హతల ఆధారంగా కాల్ లెటర్స్ పంపించేది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆ శాఖ ప్రాధాన్యం తగ్గింది. కొంతకాలంగా ఆ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. వివిధ కంపెనీల్లో కొలువులు దక్కించుకునేలా నిరుద్యోగులను ప్రోత్సహిస్తున్నారు. ఎందుకిలా!కళాశాలల్లో నైపుణ్యాలు నేర్పించడం లేదు.భవిష్యత్తును నిర్దేశించే అంశాలు బోధించడం లేదు.విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, అంతర్గత నైపుణ్యం పెంపుపై అవగాహన కరవైంది.చదువుకు, వివిధ సంస్థల అవసరాలకు పొంతన ఉండటం లేదు.ఏమిటీ మార్గం?



ఇండియా స్కిల్ రిపోర్టు ప్రకారం ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 65 శాతం మందిలోనే నైపుణ్యం ఉన్నట్లు తేలింది.డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సుల్లో కొలువుకు అవసరమైన సిలబస్ ఉండటం లేదని పరిశ్రమల ప్రతినిధులు చెబుతూనే, సమూల మార్పులు చేయాలని ప్రతిపాదిస్తున్నారు.ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రముఖ విద్యాసంస్థల్లో అమలవుతున్న కోర్సులను ప్రవేశపెట్టనున్నారు.అవసరం లేని పాఠ్యాంశాలను తొలగించి భవిష్యత్తు డిమాండ్ ఆధారంగా సిలబస్ రూపొందించనున్నారు.ఆత్మవిశ్వాసంతో ఎంపికయ్యా డిగ్రీ పూర్తి చేసిన అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ ఉపాధికల్పన శాఖ ఉద్యోగ మేళాకు హాజరయ్యా. కంపెనీ ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆత్మవిశ్వాసంతో సమాధానాలిచ్చా. ప్రస్తుతం మంచి వేతనంతో ఉద్యోగం చేస్తున్నా.మల్లీశ్వరి, ప్రైవేటు ఉద్యోగి, జగిత్యాల సన్నద్ధతపై అవగాహన కల్పిస్తున్నాం డిగ్రీ, పీజీ, వివిధ వృత్తివిద్యా కళాశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, బ్యాంకింగ్, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు సన్నద్ధతపై అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ స్థాయిలో పోటీ పడేలా నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీఎస్) పోర్టల్‌లో ఎలా నమోదు చేసుకోవాలో వివరిస్తున్నాం. నెలలో రెండు సార్లు ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాం.తిరుపతిరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి, కరీంనగర్ విషయ నైపుణ్యమే ప్రధానం ఉన్నత విద్యావంతులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. నైపుణ్యంతో కూడిన బోధన అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చదువుకునే సమయంలోనే విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి. కళాశాలల్లో కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. భాషా నైపుణ్యంపై పట్టు

# చెత్త కష్టాలు తీరేదెన్నడో?

**పెద్దపల్లి: –నవభూమి:** పట్టణ పరిశుభ్రతలో ప్రధానమైన చెత్తసేకరణ, నిర్వహణ పురపాలికలకు సమస్యగా మారుతోంది.సేకరించిన చెత్తను నిల్వ చేసేందుకు సరైన స్థలాలు ఉండటం లేదు. పైగా చెత్త సేకరణలో జాప్యం ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణలో పాలుపంచుకునే కార్మికులు వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఉన్న నగరపాలిక, మూడు పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి.ప్రతికూల ప్రభావం డంపింగ్ యార్డుల కారణంగా దోమల ఉద్ధృతి పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. చెత్తను సెగ్రిగేషన్, బయోమైనింగ్ చేయకపోవడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమస్యపై గౌరెడ్డిపేట, సుల్తానాబాద్‌లోని మార్కండేయకాలనీ, యాదవనగర్ వాసులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ సిబ్బంది కూడా తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. పెద్దపల్లి పురపాలికలో గతనెలలో రెండుసార్లు కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది.ఇదీ పరిస్థితి జిల్లా వ్యాప్తంగా వివిధ పురపాలికల్లో నిత్యం 170 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుండగా.. అత్యధికంగా రామగుండం నగరపాలికలో 140 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది.మంథనిలో 4 మెట్రిక్ టన్నులు, సుల్తానాబాద్‌లో టన్ను చొప్పున చెత్త ఉత్పత్తి అవుతోంది.రామగుండంలో నగరపాలికకు అధికారిక డంపింగ్‌యార్డు లేకపోవడంతో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌లకు చెందిన ఖాళీస్థలాల్లో చెత్తను వేస్తున్నారు.మూతపడిన మేడిపల్లి ఓసీపీలో చెత్తను వెళ్లేందుకు ర్యాంప్ నిర్మించాలనే ప్రతిపాదన ఆచరణకు నోచుకోకపోవడంతో చెత్త తాత్కాలిక డంపింగ్ కేంద్రాలకే తరలుతోంది.



## ఆలయంలో రద్దీ



**వేములవాడ, -నవభూమి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల తాకిడి నెలకొంది.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. ధర్మగుండం వద్ద పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొన్నారు. పలువురు కుటుంబ సమేతంగా కోడె మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతలను దర్శించుకుని తరించారు. దాదాపు 15 వేల మంది రాజన్నను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు.

## గురుకుల పాఠశాలలో తల్లిదండ్రుల ఆందోళన



**సుల్తానాబాద్, -నవభూమి:** సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో పరిమితికి మించి విద్యార్థులను ఉంచి..కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని తల్లిదండ్రులు ఆదివారం ఆందోళన చేశారు. "ఇప్పటికే ఇక్కడ 600 మంది విద్యార్థులు ఉన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పాఠశాల నుంచి మరో 300 మంది విద్యార్థులను ఈ పాఠశాలలో కలిపారు. సరిపడ తాగునీరు, స్నానాల గదులు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడం లేద"ని ఉపాధ్యాయులను నిలదీశారు.పాఠశాల ఆవరణంలోని విద్యుత్తు నియంత్రిక ఆదివారం మరమ్మతుకు గురవడంతో విద్యార్థులు ఉక్కపోతకు గురైనట్లు వివరించారు. ఒంటిగంటకు పెట్టాల్సిన భోజనాన్ని ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకు పెట్టారని వాపోయారు. దీనిపై ప్రిన్సిపల్ రాజేశంను 'న్యూస్టుడే' వివరణ కోరగా.. విద్యుత్తు లేకపోతే నీళ్ల కోసం ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తెప్పించామన్నారు.

## మనీలాండరింగ్ కేసుందని రూ.1.43 కోట్లు స్వాహా

**గోదావరిఖని -నవభూమి:** పోలీసుల పేరుతో మాట్లాడి మీపై మనీలాండరింగ్ కేసు ఉందని బెదిరించి ఓ వ్యక్తి నుంచి రూ.1.43 కోట్లు కాజేసిన ఘటన రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగింది.రామగుండం సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ కథనం ప్రకారం.. జులై 22న మంచిర్యాల జిల్లా మందమర్రి ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌కు ముంబయి పోలీసుల పేరుతో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తమరు మనీలాండరింగ్ కేసులో ఉన్నారని, బయటపడాలంటే నేను చెప్పిన ఖాతాలోకి డబ్బు పంపించాలని బెదిరించాడు. పంపిన డబ్బును పరిశీలించి తిరిగి మళ్లీ మీ ఖాతాలోనే జమ చేస్తానని నమ్మించాడు. దీంతో బాధితుడు విడతల వారీగా రూ.1,43,75,000లను నిందితుడు చెప్పిన ఖాతాలో జమ చేశాడు.మొత్తం డబ్బులు జమ చేసిన తర్వాత తిరిగి తన ఖాతాలోకి రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు మోసపోయినట్లు తెలుసుకొని జులై 29న 1930 నెంబరుకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన రామగుండం సైబర్ క్రైం పోలీసులు బాధితుడు డబ్బులు పంపిన ఖాతా మహారాష్ట్రలోని వాసిం జిల్లా దేవుపేటకు చెందిన సంతోష్‌శ్రీకృష్ణ నాగల్కర్‌గా గుర్తించారు. అతనిని శనివారం మహారాష్ట్రలో అరెస్టు చేసి ఖాతా నెంబరు, బ్యాంకు లావాదేవీలు పరిశీలించారు.

# వేగం సరే.. తప్పులు తొలగేనా!

**పెద్దపల్లి -నవభూమి:** ఓటరు జాబితాలో తప్పుల సవరణ, కొత్త ఓటర్ల నమోదు కోసం చేపట్టిన సర్వే ఉమ్మడి జిల్లాలో వడివడిగా సాగుతోంది.ఆగస్టు 20న మొదలైన ఈ ప్రక్రియ అక్టోబరు 18 వరకు జరగనుంది. ఈ మేరకు బీఎల్వోలు(బూత్ లెవెల్ అధికారులు) ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. పరిశీలనలో భాగంగా తప్పుగా నమోదైన పేర్లు, ఫొటోలను గుర్తిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెంది ఉండి, వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లుగా ఉన్న వారికి ఒకే చోట ఓటు హక్కు కల్పించేలా వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ కార్యక్రమంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సమీక్షిస్తుండటం సత్ఫలితాలిస్తోంది.నవంబరు 28న అభ్యంతరాలు ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం నవంబరు 28న అభ్యంతరాలు స్వీకరించనున్నారు.వలస వెళ్లిన ఓటర్ల వివరాలు, గుర్తింపు కార్డులో ఫొటో ఉందా? అనేది పరిశీలిస్తున్నారు.ఓటర్లు స్థానికంగానే ఉంటున్నారా? లేదా? అని బీఎల్వోలు ఆరా తీస్తున్నారు. మృతి చెందిన ఓటర్లను గుర్తిస్తున్నారు.అవసరమైన మార్పులు, చేర్పులపై దరఖాస్తులు తీసుకుంటున్నారు.మృతులు 15,567 మంది ఒక చోటు నుంచి మరో చోటుకు ఓటు హక్కు బదిలీ కోసం ఇప్పటివరకు 20,405 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 15,567 మంది మృతి చెందగా, 4,607 మందికి రెండు చోట్ల



ఓటు హక్కున్నట్లు గుర్తించారు. సర్వేకు వెళ్లిన సమయంలో 6,560 మంది అందుబాటులో లేరని తేల్చారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు సర్వేపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇంటింటి సర్వేలో ఉమ్మడి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. నాలుగు జిల్లాల్లో 99.51 శాతంతో మానకొండూర్ మొదటి, 85.02 శాతంతో కరీంనగర్ చివరి స్థానంలో ఉన్నాయి.లోపం ఎక్కడ? ఏటా ఓటరు జాబితాలపై సిబ్బంది నిశిత పరిశీలన చేస్తున్నా తప్పులు దొర్లడం పరిపాటిగా మారింది. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన ఓటర్లకు నిరాశే ఎదురవుతోంది. వలస వెళ్లిన వారికి రెండు చోట్ల ఓట్లుంటే బీఎల్వోల సమన్వయ లోపంతో రెండు చోట్లా తొలగిస్తున్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారి చిరునామా మారడం, ఫోన్‌లో అందుబాటులోకి రాని ఓటర్లను జాబితా నుంచి తొలగించడం సమస్యగా మారింది. కొన్ని చోట్ల బీఎల్వోలుగా వ్యవహరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు లేకుండానే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండటంతో పొరపాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఇలాంటి తప్పులను గుర్తించి సరిదిద్దితేనే సర్వేకు ఫలితం ఉంటుంది.

# వైద్యానికి నిరీక్షించాల్సిందే!

**జగిత్యాల -నవభూమి:** రోజురోజుకూ పెరుగుతున్న రోగులు, సరిపోని పడకలు, సేవలకు అనుగుణంగా లేని వార్డులు, పెద్దాసుపత్రిలో రోగుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి.జిల్లాను జ్వరాలు వణికిస్తుండటంతో మూడు నెలలుగా జిల్లా కేంద్ర ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. నిత్యం ఓపీ 400పైనే నమోదవుతోంది. అన్ని మండలాల నుంచి నిత్యం వందల సంఖ్యలో రోగులు పెద్దాసుపత్రికి వస్తున్నారు. ఓపీ కేంద్రం వద్ద, వైద్యులు రోగులను పరీక్షించే గదుల ముందు, రక్తపరీక్ష కేంద్రాల వద్ద, మందులు తీసుకునే చోట అంతటా రోగులు బారులు తీరుతున్నారు. వైద్యులు రాసిన మందులన్నీ ఆసుపత్రిలో లేకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది.నాడీ పట్టేదేలేదు..ఆసుపత్రిలో చాలామంది వైద్యులు రోగుల నాడీ చూడట్లేదు. స్టెతస్కోప్ సైతం ముట్టడంలేదు. రోగులు చెప్పే లక్షణాల ఆధారంగా మందులు రాసి ఇస్తున్నారు. రక్తపరీక్షలు కూడా రోగులు కోరినప్పుడే రాస్తున్నారు. లేదంటే మందులు రాసి పంపిస్తున్నారు. రోగులు ఎక్కువగా రావడం, వైరల్ జ్వరాలే ఉండటంతో వైద్యులు కూడా లక్షణాలకు అనుగుణంగా మందులతో సరిపెడుతున్నారు.మౌలిక వసతులు కరవు 150 పడకల స్థాయితో వైద్య కళాశాల అనుబంధంగా సాధారణ ఆసుపత్రిగా మారినప్పటికీ రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇందులో కొన్ని విభాగాలను ఎంసీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అత్యవసర వైద్యం, జనరల్ మెడిసిన్, సర్జరీలు, ఆర్థోపెడిక్ సేవలు మాత్రమే ఇక్కడ ఉన్నాయి. జ్వరాలతో పడకలు సరిపోక వార్డుల్లోనూ రోగులను ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. రోగులకు తాగునీటి వసతి కూడా లేకపోయింది. అన్ని వార్డుల్లోనూ రోగులు సేదతీరేందుకు బల్లలు, కుర్చీలు అమర్చితే సౌకర్యంగా ఉంటుంది.తప్పని నిరీక్షణ..ఓపీ కేంద్రంలో ఉదయం 10.30 నుంచి 12 గంటల మధ్య ఒకేసారి వందల సంఖ్యలో రోగులు రావడంతో నమోదు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బల్లలు సరిపోక కొందరు వరండాలో నిరీక్షిస్తున్నారు. ఆధార్‌కార్డు అనుసంధానం చేసి వివరాలన్నీ కంప్యూటర్‌లో నమోదు చేసి చీటీ ఇవ్వడానికి కనీసం రెండు మూడు నిమిషాలైనా పడుతోంది. రోగులు సహాయకుల సాయంతో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి వస్తోంది. సహాయకులు లేకుండా వచ్చేవారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోగుల నిరీక్షణ కోసం మరిన్ని బెంచీలు ఏర్పాటు చేస్తే రోగులకు సౌకర్యంగా ఉంటుంది. కన్సల్టేషన్ వద్ద కూడా ఒక్కోసారి పదుల సంఖ్యలో రోగులు గుమికూడి ఉంటున్నారు. వారంతా వరండాలోనే నిరీక్షించాల్సి వస్తోంది.ఔషధాల కొరత...సాధారణ ఆసుపత్రిలో గంటల తరబడి నిరీక్షించిన రోగులకు మందుల దగ్గరకు వచ్చేసరికి పూర్తిస్థాయిలో లేకపోవడంతో కొన్ని బయటే కొనాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని యాంటీబయోటిక్స్, ఇతర మందులు అందుబాటులో ఉండటంలేదు. విధిలేని పరిస్థితిలో రోగులు బయట కొంటున్నారు. కరీంనగర్ పంపిణీ కేంద్రం నుంచి సకాలంలో మందులు జగిత్యాలకు రాకపోవడమే కారణమని వైద్య వర్గాలు చెబుతున్నాయి.

